


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెళ్ళి మేళం

**చిన్నతనంలో మేం వెళ్ళిన** పెళ్ళిళ్ళ గురించి తలుచుకుంటుంటే ఆశ్చర్యంగా వుంటుంది. మా అమ్మ ఆఫీసర్ గారి అబ్బాయి పెళ్ళి. తెలంగాణాలో ఒక పల్లెటూరు. అప్పటికింకా మా హైద్రాబాద్ ఆంధ్రానే కదా!ఆర్.టి.సిలో ఆఫీసర్ కాబట్టి ఒక బస్ బుక్ చేసారు. పిల్లలం అందరం తెల్లవారు ఝామునే లేచి, అమ్మలు తలలు దువ్వి జడలేసి పూలు పెడితే పెట్టించుకుని, గరగరలాడే పట్టులంగాలు కట్టుకుని, ఫ్రంట్ సీట్లలో కూర్చుంటాం అని రాగాలు తీసాం. అసలు అది ఎవరింట్లో పెళ్ళీ, ఆల్‌రెడీ ఫ్రంట్‌సీట్‌లో కూర్చున్న పిల్ల, పెళ్ళికొడుకు చెల్లెలా? లేక మేనకోడలా, మనం బంధువులం కూడా కాదే... అన్న ఇంగిత జ్ఞానం కూడా వుండేది కాదా వయసులో.

సరే.. బస్ కదిలింది. కొంతమంది 'గోవిందా...గోవిందా' అన్నారు. ఇదొక అలవాటు పాపం. మా ఇంట్లో మాత్రం ఎవరైనా పోయారంటేనూ, పరీక్ష ఫెయిల్ అయితేనూ 'గోవిందా, గోవిందా' కొట్టింది అంటాం. ఇప్పుడు మా డైరెక్టర్ స్నేహితుడొకాయన, కొత్తగా వెంకటేశ్వరుడి భక్తుడై, ఎవరైనా ఫేస్ బుక్‌లో కొత్తగా సినిమా ప్రారంభించాం అని న్యూస్ పెట్టగనే 'గోవిందా గోవిందా' అని కింద కామెంట్ పెడ్తడా.. నాకు నవ్వొస్తుంది.

ఇంక ఆ బస్సు కదిలినప్పటినుండీ ఆగిపోవడమే అనుకోండీ. బాంబుగాడికి అర్జెంటుగా ఒకటికి పోవాల్సి రావడం, బాబూరావ్ బాబాయికి సిగరెట్లు లేకపోతే ప్రాణం పోతుంది కాబట్టి, బడ్డీ కొట్టు దగ్గర ఆపడం... ఎటూ ఆపాం కాబట్టి కొంతమంది కాఫీలు తాగి ఎక్కినా మళ్ళీ పెళ్ళివారి ఖర్చుమీద 'చాయ్'లు తాగడం, కొంతమంది బస్సు పడని వాళ్ళు, భళ్ళున వాంతులు చేసుకోడం, మొగుళ్ళ తిట్లూ, అత్తగార్ల సాధింపులూ, కోడళ్ళ కన్నీళ్ళూ, పెద్ద మావయ్యెవడో సర్ది చెప్పడం ఇలా...మళ్ళీ బస్సు బయల్దేరి ఊరు దాటగానే, ఒక ఇల్లాలుకి కందిచేలు కనిపించి కన్నుకుట్టి, "మావయ్యా.. ఓసారి బస్సు ఆపించు..కందికాయలు ఎంత బావుంటాయో" అని నసగడం బస్సు ఆపగానే, పొలోమని ఆడాళ్ళు కందిచేలమీద పడడం..

కోసుకున్నన్ని కోసుకురావడం, కాపలావాడు కర్రెత్తుకుని వెంట పడితే, పెద్ద మావయ్య వాడికి తృణమో పణమో ఇచ్చి, "పిల్లలు మనసు పడ్డారయ్యా.. పల్లెటూర్లు ఎన్నడూ చూడలేదు పాపం" అని సర్ది చెప్పి, బస్సు మళ్ళీ బయల్దేరడం.. ఈ సెల్ ఫోన్స్ లేవుకాబట్టి తొందరగా తెమిలారు. లేకపోతే అక్కడే రీల్స్ సెల్ఫీలు తీసుకుంటూ ఇంకో గంట గడిచేది.

ఈలోగా మా పిల్లమూకలో, కిటికీ దగ్గర మేం కూర్చుంటాం, అంటే మేం కూర్చుంటాం అనే తగాదాలూ, ఒకడు అందులో పిచ్చి అల్లరివాడో, అతిగారాబం వల్ల చెడిపోయినవాడో వుంటాడు, పక్కవాడి ముక్కు పగిలేట్లు గుద్దాడు. అంతే మునిసిపల్ కొళాయి తిప్పినట్లు పక్కవాడి ముక్కునుండి బొలబొలా రక్తం. "పదహారు ఫలాల నోము చేస్తే పుట్టాడమ్మా లేక లేక ఒక్కడు.. నా పిల్లాడ్ని చంపేసాడు బాబోయ్" అంటూ ఆ సదరు పిల్లాడి తల్లి, ఏంలేని చోట టి.వి సీరియల్‌లో కోడళ్ళు చేసినంత ఓవర్ ఏక్షన్ చేసేస్తే, బస్ ఆపేసి, వాడి ముక్కుకి పెట్టడానికి ఐస్ కోసం మళ్ళీ పెద్దమావయ్య కూల్ డ్రింక్స్ షాప్ కోసం వెతికి పట్టుకున్నాడు. వాడి ముక్కుకి ఐస్ పెట్టడమేమో కానీ, మా పిల్లల్లో సగం మంది "అమ్మా కూల్ డ్రింక్, గోల్డ్‌స్పాట్, కోకాకోలా" అని ఏడుపులు. అసలు ఎప్పుడూ బయటకి తీసుకెళ్ళక తల్లితండ్రులు ఇలా ఎప్పుడో ఒకసారి తీసుకెళ్తే అన్నీ తినేయడం, తాగెయ్యడం చెయ్యాలని ఆబగా వుండేది.

మా తమ్ముడొకడు తన పిల్లల చిన్నతనంలో "ఈ నీచులుకి ఏ షాప్‌లో ఏం కావాలో కూడా తెలీదు. నేను పని మీద శానిటరీ షాప్‌లో సామాన్ల కోసం వెళితే నాన్నా నాకు ఏదో కొనిపెట్టు. ఏదైనా సరే అని ఏడుస్తున్నారు" అని కోపంగా చెప్తుంటే నాకు తెగ నవ్వొచ్చింది కానీ, అది చిన్నప్పుడు సహజం. మేమూ అంతే బెలూన్ల వాడొచ్చినా, జీళ్ళ పాకం వాడొచ్చినా, ఐస్‌క్రీం వాడొచ్చినా, ఎవడొచ్చినా మా సందులోకి అందరిళ్ళలోంచీ పిల్లల శోకాలు ఏ.ఐ.ఆర్ నిలయ విద్వాంసుల నాదస్వరాల్లా మారుమోగిపోయేవి. తినేవే అక్కర్లేదు. గాజుల బండివాడొచ్చినా, వినోలియా తీసుకుందని, ఎదురింటి తెల్ల చిట్టీ, అది కొందని కింద పడి గిలగిలా కొట్టుకుని, పెద్దవాళ్ళని ఒప్పించి కర్రి బుజ్జీ, వీళ్ళని చూసి నేనూ. అంతా ఏడ్చి కొనుక్కునేవాళ్ళం. పూలు, పండ్లు, గాజులు, సోడాలు చివరికి కత్తులకి పదును పెట్టే వాడొచ్చినా, అదిగో ఎదురింటి ఫకీరమ్మ పదును పెట్టిస్తోంది. వాడు సైకిల్ తొక్కుతూ పదును పెడ్తుంటే, నిప్పు రవ్వలు ఎంతబావున్నాయో. మనమూ పదును పెట్టించాల్సిందే అని ఏడుపులు. మా అమ్మమ్మ అన్నింటికీ ఒప్పుకునేది కాదనుకోండీ. కొన్నింటికి పిక్కపాశాలు పెట్టేది. అయినా బుద్దొచ్చేదికాదు. చిన్నతనంలో పెద్దాళ్ళ దగ్గరేదో డబ్బులు కాసే చెట్టు వుండేది అనుకునేవాళ్ళం. అలా చూసిన ప్రతిదానికీ పేచీలు పెట్టేవాళ్ళం.

అలా బస్సులో అందరూ, సోడాలూ, అందులోనూ రంగు సోడాలూ, పిల్లలు బ్రేవ్ అనే త్రేంపు వచ్చేదాకా కూల్ డ్రింక్‌లూ కానిచ్చి ఆ బస్సులో కండక్టర్ సీటులో కూర్చున్న పెళ్ళి కొడుకు తండ్రిదో, అన్నగారిదో జేబు ఖాళీ చేయించాక మళ్ళీ బస్సు కదిలింది.

పిల్లలు ఏడుపులూ, పెద్దవాళ్ళ ఫెళ్ళున నవ్వులూ, పెద్ద గొంతులతో కబుర్ల మధ్యలో ఓ ఘంటసాల గంట కొట్టినట్లు లేచి నిలబడి "ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరుహించెదరూ" అని మంచి శోకరస ప్రధానమైన పాట అందుకునేవాడు. ఆ దిక్కుమాలిన అపశకునం పుణ్యమా అని బస్సు కాస్తా ఆగిపోవడం.. టైర్ పంక్చర్ అని క్లీనర్ చూసి చెప్పడంతో, మగాళ్ళు బస్సు దిగి, ఆ టైరు మార్చేలోగా సమయం సద్వినియోగం చేసుకుంటూ, చెట్టుకింద తుండుగుడ్డ పరిచి పేకాట మొదలుపెట్టారు.

ఆడవాళ్ళలో అపర ఎస్.పుశీలలాంటి ఒకావిడ "పాడవే..పాడు.. నీ ఇల్లు బంగారం కాను" అని బతిమాలించుకుని, బతిమాలించుకుని, గళమెత్తి "అమ్మా...." అని రాగం ఎత్తగానే, ఆఖరి సీట్లో నిద్రకి జోగుతున్న తాతగారు, కళ్ళు మూసుకునే "చిల్లర లేదు.. పైకెళ్ళు" అన్నారు. అంతా గొల్లుమన్నారు. కానీ పుశీల స్పోర్టివ్‌గా తీసుకుని, "జననీ...శివకామినీ" పాట పుర్తి చేసింది. అంతసేపు బతిమాలిన వాళ్ళూ, ఆవిడ పాట అందుకోగానే, "ఈ నెక్లెస్ ఎన్ని తులాలు వదినా?" అని కబుర్లలో పడ్డారు. ఆ తర్వాత ఇంకొకావిడకి ఊపొచ్చి "చీకటిలో...కారు చీకటిలో కాలమనే కడలిలో..లోకమనే అడవిలో ఏ దిశకో.." అని శోకగీతం అందుకుంది.

"ఛత్! నోళ్ళు మూయండి. శుభమా అని పెళ్ళికెళ్తూ వెధవ పాటలు" అని పెద్ద మావయ్య కసురుతూ బస్సెక్కాడు. టైర్ మార్చడంతో మళ్ళీ బస్సు స్టార్ట్ అయింది.

కొంత దూరం వచ్చాక, కాంతం పిన్ని అన్న ఆవిడ "మా ఆయన... మా ఆయన అని గావుకేకలు. ఆయన బస్సు దిగి లఘుశంక తీర్చుకోడానికి పొలాల మధ్యన పడి చాలా దూరం వెళ్ళాడుట పాపం.

"మా నాన్న రాకపోతే బావుండ్ను" అన్నాడు నా పక్కన కూర్చుని లడ్డూవుండ తింటున్న వాళ్ళ అబ్బాయ్ ఏడుకొండలు. కానీ కాసేపటికి ఇద్దరు మగాళ్ళు బస్ దిగి వెళ్ళి మోసుకొచ్చారు. సరదాగా దిగిన బాబాయ్, తాటికల్లు కుండలు చూసి, ఆపుకోలేక నాలుగు గ్లాసులు లాగించేసాడట. "దిక్కుమాలిన సంత" అంటూ, పెళ్ళి కొడుకు తండ్రి మళ్ళీ "రైట్ రైట్" అంటూ బస్ ముందుకి పోనిచ్చాడు.

"ముహూర్తం టైముకి చేరతామో లేదో" అంటూ గోవింద పెదనాన్న హడావిడి పడిపోతున్నాడు. ఆయన రైల్వేలో పని చేస్తాడుట. రైలు రాత్రి తొమ్మిదింటికి డిపార్చర్ అంటే మధ్యాహ్నం పన్నెండుకల్లా కుటుంబాన్ని ప్లాట్‌ఫారం మీద కూలేస్తాడని వాళ్ళావిడ చెప్తోంది. ఈలోగా ఒకావిడకి మూర్చ వచ్చింది. ఆవిడ తల అడ్డంగా వూపుతూ గిలగిల కొట్టుకుంటుంటే, పక్కనున్న ఆవిడ అత్తగారు "దీనికి మళ్ళీ ఒంటిమీదకి పైడమ్మ తల్లొచ్చిందర్రా... పెళ్ళికొడుకు అమ్మా నాన్నలు ఏవైనా మొక్కులు తీర్చుకోలేదా? ఆలోచించి త్వరలో తీరుస్తామని చెప్పండి" అంది.

ఆవిడ నోట్లో నిమ్మకాయలు పెట్టారు. "ఎవరైనా డాక్టర్ వున్నారేమో చూడండి" అని మా అమ్మ లాజికల్‌గా మాట్లాడబోతే, నోరు నొక్కేసి " ష్! ఆవిడకి ఇలాగే ఒంటి మీదకి దేవతొస్తుంది. హారతిస్తే పోతుంది" అన్నారు.

ఆవిడ మొగుడొక హారతి పళ్ళెం అగ్గిపెట్టె, కర్పూరం సంచిలోంచి తీసి ఆవిడకి హారతి ఇచ్చాడు. పనిలో పని అందరిచేతా ఆ పళ్ళెంలో డబ్బులు వేయించాడు.

ఈసారి నిజంగానే, ముహూర్తం టైంకి చేరలేమేమో  అని అందరికీ అనిపించింది.

ఆవిడకి దేవత రాగానే ఆవిడ మొగుడు తనకి తీర్చని ఎర్ర పట్టుచీరతో సహా రకరకాల కోర్కెలు అడిగి, పెళ్ళికొడుకు తండ్రి చేత "సరే తల్లీ...దిగు. పెళ్ళిలో నీకు పట్టు చీర పెడ్తా, అన్నదానం చేయిస్తా, ఆరు కుంచాల బియ్యం వడిబియ్యం పోయిస్తా"లాంటి ప్రామిస్‌లన్నీ చేయించుకుని, టికెట్ కలెక్టర్ తన పనికాగానే బస్ దిగి వెళ్ళిపోయినట్లు, ఆవిడ ఒంటిమీదనుండి దిగి వెళ్ళిపోయినట్లుంది. ఆవిడ సొమ్మసిల్లి పడుకుంది.

"దీన్ని తీసుకురావద్దు అని ముందే చెప్పాను. మా ఆయన వినలేదు. దీనికి పట్టుచీర కావల్సినప్పుడల్లా, ఇలాగే పూనకం వస్తూ వుంటుంది" అని పెళ్ళికొడుకు తల్లి, తన అక్కతో రుసరుసలాడింది. ఆ 'పూనకాలు లోడింగ్' ఆవిడ, ఈవిడకి ఆడబిడ్డట. ఇవన్నీ పాలిటిక్స్ అని మాకు ఆ వయసులో తెలీదు.

కిటికీలోనుండి బయటకి చూస్తుంటే, కనిపించే పక్షుల బారులూ, దూరం అవుతున్న టెలిఫోన్ స్తంభాలూ, అందంగా ప్రశాంతంగా ఊరి చివర్ల కనిపించే శివాలయాలూ, వాటిలో కోనేరులో ఒంటికాలిమీద నిలబడి జపం చేసే కొంగలూ, రోడ్డుకి అడ్డంపడి బస్సు ఆపే బ్రేక్ ఇన్‌స్పెక్టర్లులాంటి పశువులూ.. అన్నీ ఆ వయసులో గొప్ప సరదాగా వుండేది.

ఎట్టకేలకి మిడసరి లగ్గం అన్నట్లు పన్నెండు గంటలకి బస్సు పెళ్ళివారి ఊరు చేరింది.

అసలు పెళ్ళికొడుకు వస్తాడా లేడా అన్నంత కంగారు పడ్తున్న ఆడపెళ్ళివారు, బస్సుని ఊరి మొదట్లోనే ఆపి, బుక్కాలు కొట్టి ఆ తర్వాత దిష్టి గుమ్మడికాయా, పారాణి నీళ్ళూ దిగదుడిచి పోసి, హారతిచ్చి, కాళ్ళు కడిగి మా అందరికీ పానకం ఇచ్చి, పన్నీరు జల్లి సన్నాయి మేళంతో "శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండీ" అని వాయిస్తూ వుంటే వాళ్ళు తెచ్చిన కార్లో పెళ్ళికొడుకునీ, అతని అమ్మా నాన్నల్నీ, అక్క చెల్లెళ్ళనీ ఎక్కించి తీసుకెళ్ళారు. అప్పట్లో సెల్ ఫోన్లు లేక పాపం ఎంత కంగారు పడ్డారో? ఈ బస్  ఎంతవరకు వచ్చిందో తెలియక, అసలు వస్తున్నారో లేదో తెలియక.

మొదటిసారిగా నా జీవితంలో, పెళ్ళింట్లో పలహారం కారం బొరుగులూ, సఖినాలూ, బూందీ లడ్డూ పెట్టడం చూసా. మా ఇళ్ళల్లో ఉప్మాలూ, ఇడ్లీ చట్నీలూ పెట్టేవారు.

ఆ తరువాత నిద్రకి సోలిపోతున్న పెళ్ళికొడుకుకి మంగళస్నానం చేయించి స్నాతకం చెయ్యడానికి, పెళ్ళి కొడుకు తండ్రి కోసం చూస్తే, కనిపించలేదు. ఓ అరగంట వెతికితే, పెళ్ళి పందిరి వెనకాల బావమరుదులతో పేకాట ఆడుతున్నాడని కనిపెట్టి పట్టుకొచ్చారు.

"త్వరగా కానీండి. హేండ్ మంచి రెయిజ్‌లో వుంది" అంటున్నాడు, డిస్టర్బ్ చేసినందుకాయన.

పెళ్ళికొడుకు తల్లి "ఈయన పేకాట పిచ్చి కూలా! ఎకరాలు ఎకరాలు అమ్మేసుకున్నా ఈ పిచ్చికి" అని తలకొట్టుకుంది.

పెళ్ళికొడుకుని ఒక స్టూల్ మీద కూర్చోపెట్టి పెళ్ళి కూతుర్ని కింద పీటమీద కూర్చోపెట్టారు.

ఈలోగా పెళ్ళికొడుకు పెద్ద మేనత్తకి, బొట్టుపెట్టకుండా, పక్కన ఆవిడకి పెట్టారుట ఆడపెళ్ళివారు. ఆవిడ అలిగి వెళ్ళిపోతానని పెద్ద కొట్లాట. పాపం పెద్దమావయ్య సర్ది చెప్పాడు.

పంతులు తెలంగాణా భాషలో పెళ్ళి జరిపించాడు. "గడ పోక సెక్కలున్నయ్.. సూడుండ్రి.. ఆరంజ్యోతి కానొస్తుందా? కానొస్తుందా బిడ్డా. ఆరీతిగా పెనిమిటిని గొలవాల.. మేళం వోడు గేడ పాడాయిండు? కొట్టుమనుండ్రి.. గట్టిగ కొట్టుండ్రి.." అని మాట్లాడ్తుంటే, అదే తెలంగాణా భాషలో మొదటిసారి పెళ్ళి చూడడం ఏమో చాలా సరదాగా అనిపించింది.

Post your comments







